


# బంధు ఆగమనం

శ్రీ దండమూడి మహీధర్‌కుమార్

## 1

[ఇప్పుడే గుంటూరినుంచి బెజవాడ రావలసిన రైలు వచ్చి ప్లాటుఫారంమీద ఆగింది రాత్రి 11 గంటలు రైల్లోనుంచి సీతారామయ్యగారు, ఆయన కొడుకు శీనూ దిగి ఎవరినో వెదుకుతారు, చివరకు స్టేషన్ బయటికి వచ్చేటప్పటికి రిక్షావాళ్లూ, జట్కావాళ్లూ 'బండి కావాలా బాబూ! రండి, రండి!!' అంటున్నారు సీతారామయ్యగారు పన్నెండేళ్ల శీనుగాణ్ణి ప్రశ్నించారు 'ఏంరా! అబ్బాయ్! జట్కాలో వెళదామా, రిక్షాలో వెళదామా' అని! ఇలా అడుగుతూండేటే రిక్షావాళ్లూ, జట్కావాళ్లూ వనకటలాగా ముసురుకొని 'ఎక్కడికండీ! రండి! రండి!' అంటూ గోలపెడుతున్నారు ఆఖరికి ఒక రిక్షాలో ఎక్కి సూర్యారావుపేటకు బయలుదేరారు]

సీతా  కాస్త తొరగా లాగవోయ్

రిక్షా  చిత్తం బాబూ!

సీతా  ఏంరా శీనూ! ఇప్పుడు ఆ హరిపురుషోత్తంగారు ఇంటిదగ్గర వుండేనా?

శీను  నాకేం తెలుసు!

సీతా  కాస్త స్టేషనుకు రమ్మని ఉత్తరం కూడా వ్రాశాను, రాకూడదూ?

రిక్షా  బాబూ ఎటెల్లాలండీ!

సీతా  నేరుగా పోవోయ్! పో, కాస్త రుగెత్తు!

రిక్షా  రోడ్డు సరిలేదండీ! రాళ్లూ, గోతులూ!

సీతా  అయితే, రిక్షా ఎందుకు లాగుతున్నావోయ్, ఒంట్లో కూచో లేకపోయావా?

రిక్షా  ఎలా గడుస్తదండీ!

సీతా  సరే, పదవోయ్, అధిక ప్రసంగం చేయక! ఆ మహానుభావుడు వున్నాడో లేదో!

* * *

కాస్త ముందుకు పోనిచ్చి, ఆ కన్పించే యలక్ట్రిక్ దీపం దగ్గిర ఆపు! - ఆఁ, అక్కడే!

## 2

రిక్షా: సూర్యారావుపేట చివర బజారులో ఆగుతుంది

సీతా ఎంత ఇవ్వమంటావురా!

రిక్షా మీకు తెలియందేముంది బాబూ! పదణాలిప్పించండి!

సీతా పదణాలా, పదిరూపాయలా? అర్ధరూపాయిస్తే జట్కా వస్తుంది నిన్నెందుకు పిలవటం? ఇదిగో ఈ పావలా తీసుకో!

రిక్షా: లేదు, బాబూ! పగటిపూటయితే స్టేషన్నుంచి ఆరణాలు తీసుకుంటాం బాబూ! రాత్రి పన్నెండు గంటలప్పుడు, ఇద్దర్ని మోసుకొచ్చానండి కష్టాన్ని చూచి ఇవ్వాలండీ!

సీతా ఈ కుర్ర వెధవనుకూడా ఒక నిండుమనిషి క్రింద జమకట్టావు వీడి వయస్సెంత, వీడి ఒరు బరువెంత? అయినా మీ రిక్షాలాగేవాళ్లు పట్టి మొండిఘటాలు!

రిక్షా కష్టానికి తగ్గ ఫలితం ఇప్పించమని కోరుతున్నా, స్వామీ! నేను ఊరికే మిమ్మల్ని అడగటంలేదండీ!

సీతా సమాధానాలు చెప్పటానికేమోయ్, ఎన్నయినా చెప్పొచ్చు! ఇదిగో తీసుకో ఈ ఆరణాలు!

రిక్షా లేదండీ, న్యాయం ఆలోచించండి, బాబూ!

సీతా ఏమి న్యాయమోయ్? న్యాయమెక్కడుంది? నేను పది సంవత్సరాలనుంచి గుమస్తాగిరీ ఏడుస్తున్నాను ఈ పది సంవత్సరాల్లోనూ నేను చూసింది అన్యాయం తప్ప న్యాయమెక్కడా కన్పించలేదు! తీసుకో, పోనీ ఈ అర్ధరూపాయి!

రిక్షా (తీసుకొని) ఇంకో అణా ఇప్పించండి!

సీతా లేదు వెళ్లవోయ్ గొడవచేయక!

రిక్షా: ఏమి న్యాయమండీ? ఎన్నో ఖర్చులు చేస్తారు, ఎంతో దుబారాచేస్తారు, బీదవాళ్ళకు ఒక అణా ఇవ్వవలసివచ్చేటప్పటికి బాధపడతారు!

సీతా ఏడిశావులే నడవ్వోయ్, వెధవ నీతులు!

## 3

[రిక్షావాడు ఏదో గొణుక్కుంటూ వచ్చినదారినే రిక్షాను దడదడ మనిపించుకుంటూ వెళ్తున్నాడు - సీతారామయ్య - రిక్షావాడి గొడవవిని ఆ చుట్టుపక్కల వున్నవాళ్లు నిద్రనుంచిలేచి బయటికొచ్చి నిల్చున్నారు! ఒకళ్లిద్దరు మంచాలమీదనే కూచుని - కళ్లు నలుపుకుంటూ 'ఎవరయ్యా అర్ధరాత్రి వేళ ముద్దిల దరువూ' అంటున్నారు ఎదురింటి రంగయ్యగారూ, ఆయన పెద్దకొడుకు వాసూ వసారాలో నిల్చున్నారు ఆ పక్క పోర్షన్లో వుంటున్న ఆదిశేషయ్యగారు పసికుర్రాణ్ణి ఎత్తుకొని 'ఎవరండీ' అంటూ బయటికి వచ్చాడు వేసవికాలం గనుక బయట బజార్లో మంచాలమీద పడుకున్న సుబ్రమణ్యంగారూ, శేషావతారంగారూకూడా లేచి గోచీ సరిజేసుకుంటూ రంగయ్యగారింటిముందుకు వచ్చారు]

రంగయ్య ఎవరు కావాలండీ మీకు?

సీతా హరిపురుషోత్తంగారిల్లు ఇదే గదండీ!

వాసు: హరిగారిల్లా మీకు కావలసింది?

ఆదిశేషయ్య ఏం? మనింటికనుకున్నావా?

సుబ్రమణ్యం కాదు, మా ఇంటికనుకున్నాడు వాసు! తరచు మా ఇంటికే వస్తుంటారు-చుట్టాలు పొద్దుపోయి!

శేషావతారం: సరే బాగానే వుంది, మీ సంభాషణ! ఆ పెద్దమనిషి నిల్చునుంటే హరిగారిల్లేదో చెప్పకుండా నేనాఇదంతా!

రంగయ్య అయినా, ఈ బెజవాడలో, ఎవరి నడిగినా హరిగారిల్లు చెబుతారు. ఇక సూర్యారావుపేటలో, ఈ 'వెన్నపూసవారి సందు'లో వేరే అడగాలా?

సీతా ఈ ఎదురిల్లేగదండీ!

ఆదిశే సరే, మళ్లా మొదటికొచ్చారూ!

సుబ్ర ఏ ఇల్లో తెలీకుండానే ఈ అర్ధరాత్రి వచ్చారా?

శేషా సందేహ నివృత్తికోసం అడుగుతున్నారు! తెలిసివున్నదాన్నే మళ్లా మళ్లా అడగి తెలుసుకోటం, ఎందుకైనా మంచిదే!

ఒకసారి ఏం జరిగిందనుకున్నారు? క్రిందటి సంవత్సరమనుకుంటాను మా ఇంటికి రావలసిన బంధువులు ఆమూలమీద వున్న కోమటి సుబ్బయ్యగారింటికెళ్లి నా భార్య పేరుపెట్టి 'సీతామాలక్ష్మి! సీతామాలక్ష్మి!!' అని పిలిచేప్పటికి, కోమటి సుబ్బయ్యకాస్తా భయపడి, భార్యను లేపి దొంగలు! దొంగలు!! అని అరిచాడు. బజారంతా ఒకటే గొడవ అప్పటికి మీరీ ఇంట్లోకి రాలేదు! ఆఖరికి అంతా కలిసి నన్నే అన్నారు ఆ వచ్చే బంధువులికి సరైన చిరునామా ఇవ్వలేకపోయావా, లేకపోతే పగటిపూటయినా రమ్మని ఉత్తరం వ్రాయలేకపోయావా, అని!

రంగయ్య అప్పటిదాకా ఎందుకండీ? ఒక వారంరోజులక్రితం - వాసు మేనమామ ఇక్కడికి వచ్చాడు రెండో సినిమాకు వెళ్లి వచ్చి తలుపు తట్టాడు వాసుకు అతడు సినిమాకు వెళ్లినట్లు తెలీదు! తలుపు తట్టగానే కర్ర ఒకటి చేతులో పుచ్చుకొని తలుపు తీశాడు! చూస్తే వాళ్ళ మేనమామ! అంతా ఒకటే నవ్వు! దొంగ అలా వచ్చి తలుపు తడతాడటండీ! అలాంటిది జరిగితే, బొంబాయి, కలకత్తాల్లో జరగాలి!

శేషా చూచారూ, వారలాగే నిలబడ్డారు! ఏమండీ తమ రెక్కడనుంచి వస్తున్నారండీ?

సీతా గుంటూరునుంచి వస్తున్నానండీ!

రంగయ్య గుంటూరునుంచా? ఏమిటోనండీ, గుంటూరు పేరెత్తితేనే మాకు భయం!

వాసు మా ఫ్రెండ్ ఒకడు మలేరియాతో చనిపోయాడు!

ఆదిశేషయ్య ఒక్క మలేరియా ఏంటి బాబూ, అన్నిరకాల అనారోగ్యాలూ అక్కడే వున్నాయి! నీళ్లు దొరకవు గదా, అద్దెకొంపలు అసలే దొరకవు! అధవా దొరికినా నీళ్ళఏర్పాటు వుండదు. నూతులు చూడబోతే నేమో. చేంతాళ్లు చాలవు - మోకులు కావాలి! వీటన్నిటికీ మించింది అక్కడ జీవిత పరిమాణం ఇతర పట్టణాలకంటే చాలా ఎక్కువ! ఎందుకో మరి!



సుబ్రమణ్యం కాలేజీల్లోని విద్యార్థుల సంఖ్య ఎక్కువ కావటంవల్ల ప్రతిదాని ధరా మండిపోతూవుంటుంది వాళ్లకేం! ఎంత చెబితే అంత!

శేషావతారం అయితే, ఏమండీ- తెలీక అడుగుతాను గుంటూరు కాలేజీలలో ఎప్పుడు స్ట్రయికు లేనటగా?

సీతా వెనక అలాగే వుండేవి, కాని ప్రస్తుతం కొంత నయమేనండి!

వాసు అప్పుడు కమ్యూనిస్టుకుర్రాళ్లు జాస్తిగా వుండేవారు, ఇప్పుడంతా సఫా అయిపోయిందిగా! అందుకని శాంతంగా వున్నాయేమో, కాలేజీలు!

సీతా అబ్బే, అలా అంటారు కాని వాళ్లననాల్సిన పనిలేదు! ఆ సమస్యలే ఇప్పుడూ ఉన్నాయి! ఇంత కాలమాయె- మన గవర్నమెంటు వచ్చి! గుమాస్తాల జీతం పెరిగిందా? స్కూలుమాష్టర్ల జీతాల్లో ఏమైనా భేదం వచ్చిందా? ఇంకా జీవితావసర వస్తువుల్లో ఏమైనా మార్పు వచ్చిందా అంటే ఏమీ లేదు-అన్నీ పెరిగిపోతున్నాయి! ఇక ఆహారపదార్థం సంగతి వేరే చెప్పాలటండీ! అయినా మనం ఈదుకొస్తూనే ఉన్నాం!

రంగయ్య. తమరు చెప్పింది, అక్షరాలా సత్యమండి! ప్రతివాడికీ బాధగానే వుంది!

ఆది అందుకే కాంగ్రెసులో ముసలం పుట్టింది! కృపలానీ వేరేపార్టీ లేవదీశాడుగా!

సీతా ఏమండీ ఇలా క్రొత్త పార్టీలు తలెత్తటం అవసరమే నంటారా?

సుబ్రమణ్యం అవసరమేటండీ, అవసరం న్నర! ఏదో ఒక ఎదురు పక్షం లేకపోతే ప్రస్తుతం వున్న గవర్నమెంటు ఇంకా ఇలాగే తప్పటడుగులు వేస్తూ వుండొచ్చు!

శేషావతారం. నా అభిప్రాయం ప్రకారంగా అయితే ఇన్ని పార్టీలుండటం అనవసరం! అటు పాట్నాలో కృపాలనీగారు ఒక పార్టీని నిర్మిస్తే ఇక్కడ ఆంధ్రలో 'ప్రజాపార్టీ' లోనే మరల రెండుపార్టీలు! చీలికలు! అభిప్రాయ భేదాలు!! ఎందుకొచ్చిన గొడవలండి? ఎవరొచ్చినా తాతా, బిర్లా, డాల్మియాలకు స్నేహితులుగా తయారయి, సామాన్యపౌరునికి శత్రువులుగా తయారవుతారు!

సీతా సామాన్యుడి జీవితం చాలా దుర్భరంగా వుంది! నేను తాలూకాఫీసులో గుమాస్తాగా వుంటున్నాను! 90 రు వస్తున్నాయి ముగ్గురు పిల్లలూ! దేనికి చాలదూ! ఏదో జీవిస్తున్నాం!

శేషా ఇంతకూ రంగయ్యగారిలాగా, ఆదిశేషయ్యగారిలాగా ఏదైనా వ్యాపారంలోకి దిగితే బావుండును!

రంగయ్య: సాధక బాధకాలు ప్రతిదానిలోనూ వున్నాయనుకోండి!

సుబ్రమణ్యం ఎలాగయినా, నాకూ శేషావతారానికి ఈ మాష్టరుఉద్యోగం మానేస్తేనే బావుండు ననిపిస్తోంది

శేషా ఇదుగో చూచారా, వారలాగే నిలబడ్డారు! వీరు మంచి రసజ్ఞులులాగా కన్పిస్తున్నారు!

సీతా ఏమి రసజ్ఞతండీ! ఈ కుర్రవాడు మా పెద్దవాడు ఆరోగ్యం సరిలేదండీ ఇక్కడ హరిపురుషోత్తం స్నేహితుడు - ఒక డాక్టరున్నాడు అయనకు చూపించవచ్చునని - తీసుకొచ్చాను

శేషా హరి వున్నాడో లేదో మరి!

సీతా ఒరే శీనూ కొంత ఆ తలుపుదగ్గర కెళ్లి చూడు!

[శీను తలుపుదగ్గర కెళ్లి హరిపురుషోత్తంగారూ! హరిపురుషోత్తంగారూ!! అని పిలుస్తాడు కాని జవాబు వుండదు]

రంగయ్య నిన్న సాయంత్రం నాకు మంగళూర్ సెంటర్ లో కనిపించాడు

వాసు సినిమాకు వెళ్లివుంటాడేమో?

ఆదిశేషయ్య ఇప్పుడేమి సినిమా?

సుబ్రమణ్యం ఇప్పుడెంతయింది టైం?

వాసు ఒంటిగంటకు పది నిమిషాలు తక్కువ!

శేషా అరే చాలా పొద్దుపోయింది ఒరే, అబ్బాయీ! కొంత తలుపు తట్టి చూడు మళ్లీ!

## 4

[శీను మళ్లీ తలుపు గట్టిగా తట్టి హరిపురుషోత్తంగారూ! హరిపురుషోత్తంగారూ!! అని బిగ్గరగా కేకలు పెడుతూ తడుతూనే వుంటాడు

ఈ చప్పుడుకు రంగయ్యగారింట్లో వున్న ఆడవాళ్లూ, ఆదిశేషయ్యగారి భార్యా - సుబ్రమణ్యంగారింట్లోనుంచి అయన విధవ తల్లీ - శేషావతారం పెద్ద కూతురూ లేచారు 'ఏమిటి గొడవ!' అని ఆదిశేషయ్యగారి భార్య బయటికొచ్చి చంటిపిల్లాణ్ణి విసురుగా లాక్కొని వెళ్తుంది రంగయ్యగారి భార్య - 'ఎవరండీ' అంటుంది! ఎవరూ సమాధానం చెప్పరు ఒక్కరొక్కరే రంగయ్యగారు తదితరులూ హరిగారింటి ముందుకొచ్చి ఆగుతారు]

రంగయ్య: ఆడవాళ్లనుకూడా ఇంటికి పంపించేశాడు ఈ మహానుభావుడు ఏ స్నేహితుని ఇంటిదగ్గరో మకాం వేసి వుంటాడు!

శీను లోపల గడియ వేసి వుందండీ!

రంగయ్య. అలాగా! అయితే చూడు శేషావతారం!

[శేషావతారం తలుపుదగ్గరి కెళ్లి తలుపు గట్టిగా తట్టి 'హరీ! హరీ!!' అని బిగ్గరగా పిలుస్తాడు ఈ చప్పుడుకు ఆ బజార్లో వున్న మరికొన్ని ఇళ్లనుంచి మగవాళ్లూ ఆడవాళ్ళూ వచ్చి 'ఏమిటండీ, ఏమి జరిగింది?' అని అడుగుతున్నారు!]

రంగయ్య నల్లమందుభాయీలాగా ఇంత మొద్దు నిద్దరేంటి?

శేషా మీ రిక్కడే వుండండి నేనూ మా దొడ్లోగుండా వాళ్ల దొడ్లోకి వెళ్లి పైకి వెళ్లి చూస్తాను - బహుశా డాబామీద పడుకున్నాడేమో!

## 5

[శేషావతారం వాళ్లింట్లోగుండా లోని కెళ్లి అక్కణ్ణుంచి డాబామీది కెళ్లి హరిపురుషోత్తంగారిని లేపుతాడు]

హరి (గాభరాగా లేచి) ఏంటిరా గొడవ! నీ వెలా వొచ్చావ్? తలుపులు తీసే ఉన్నాయా?

శేషా లేదు, నేనూ మా దొడ్లోనుంచి దూకి వచ్చానులే!

హరి ఏం జరిగింది?

శేషా మీ ఇంటికి ఎవరో వచ్చారు!

హరి ఎవరు? [అంటూనే గబగబా లేచి బయటికొస్తాడు]

[బయట జనం గుమిగూడివున్నారు రంగయ్యగారూ, ఆదిశేషయ్యగారూ, సుబ్రమణ్యంగారూ - సీతారామయ్యగారితో 'పాలిటిక్స్' మాట్లాడుతున్నారు ఇంకా ఏమీ తేలకుండా వుంది వాళ్ళకు వెనకగా, క్రొత్తగా లేచి వచ్చిన మరికొంతమంది మగవాళ్లు పిల్లమాటల్ని ఆలకిస్తున్నారు ఇంకొంచెం దూరంలో ఆడవాళ్లు నిల్చొని 'పాతాళభైరవి' సినిమాను గూర్చి చీరెలను గూర్చి మాట్లాడుకుంటున్నారు

హరి వీళ్ళందర్నీ చూచి భయపడి

(36-వ పేజీ చూడండి)

**కుష్ఠు ★ బొల్లి**

వగైరా మేహపుచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటి చికిత్స, క్యాటలాగు ఉచితం జి వి రెడ్డి అండ్ కో (రిజిష్టర్డు) భాస్కరాశ్రమము" గోపాలపురం, తూ గోదావరి

# వారసులు ఎవరు?

(-15వ పేజీ తరువాయి)

ఆమె వెనకనే మోజస్సు కూడా వచ్చాడు కమలను చూసీ చూడ్డంతోనే "అమ్మాయీ!" అంటూ లేచివచ్చి కావిలించుకున్నది మహాలక్ష్మమ్మగారు

"నాన్నకు జబ్బేమిటమ్మా?" అంటూ వచ్చి మహాదేవయ్యగారి మంచంమీద నే కూచున్నది కమల

బయట తూర్పువాళ్ల సంఖ్య హెచ్చింది అందరూ గందరగోళంగా చెప్పుకో సాగారు

"ఛీ - అవతలికి పో!" అంటూ వాళ్లు తెలియని కోపంలో గర్జించాడు వెంకయ్య మహాదేవయ్యగారి బొటనవ్రేలికి కాటుక పట్టిస్తున్నాడు ప్రక్కనే విల్లుకాయితాలు రెండూ పట్టుకు నుంచున్నాడు దామోదరం

వెంకయ్యమాట అందరికీ వినబడింది కాని, కమలకు మోజస్సుకు వినబడినట్లు లేదు అతను కూడా వచ్చి కమలదగ్గిరే కూర్చున్నాడు

మహాదేవయ్యగారి మొహంలోకి చూస్తూ "నాన్నా" అని పిల్చింది కమల ఆయన పలకలేదు మళ్లీ బిగ్గరగా అరిచింది, రెండు చేతులతో తలపట్టుకు కదిలిస్తూ మహాదేవయ్యగారు మాటాడలేదు, చలనం లేని ఆయన కళ్లు ఏదో సందేశాన్నిచ్చిన ట్టున్నయ్

ఏడుపుగొంతుతో ఏదో చెప్పబోతున్నది మహాలక్ష్మమ్మగారు నాన్న మొహంలోంచి తల పైకెత్తి చూసింది కమల వెంకయ్య, దామోదరం వ్రేలిముద్రలు వేయించే ప్రయత్నంలో మునిగి వున్నారు సాభిప్రాయంగా మోజస్సు వంక చూసి ఏదో సౌంజ్ఞ చేసినట్టున్నది కమల

దామోదరం చేతులో వున్న విల్లకాయితాలు లాక్కుని పరపరా చింపివేశాడు మోజస్సు

ఇదంతా చూస్తూవున్న జనం "వారసులు ఎవరు?" అని విచిత్రంగా ప్రశ్నించుకుంటున్నారు ★

(అయిపోయింది)

# బంధు ఆగమనం

(20-వ పేజీ తరువాయి)

పోతాడు వాకిట్లోనే నిలబడి శేషావతారాన్ని 'ఏంటీ గొడవ!' అని అడిగాడు]

శేషా వినండయ్యా, వినండి! ఈయన గారు 'ఏంటీ గొడవ' అని అడుగుతున్నారు! చావటానిక్కూడా సమయం దొరకని ఈ రోజుల్లో రాత్రి కొంచెం మేనువాల్చి కష్టాల్ని మరచిపోవాలని అనుకుంటున్న సమయంలో ఎవరో ఒకరు వచ్చి నిద్రాభంగం చేయటం పరిపాటయిపోయింది అలాగే ఇవ్వాళ్ల హరిగారి బంధువు వచ్చి పన్నెండు గంటలవేళ రిక్షావాడితో పోట్లాడుతూ మమ్మల్ని లేపేడు ఇలా మన నిద్దల్ని ఇకముందు పాడుచేయకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి వుంటుంది!

రంగయ్య ఏమండీ,మీరు ఒక ఉత్తరం ముక్క వ్రాసి రాకూడదూ?

సీతా వ్రాశానండీ! అందలేదు కాబోలు!

ఆదికే ఏమి వ్రాశారో! ఈ రోజుల్లో ఉత్తరాలు సరిగా చేరుతున్నాయటండీ టెలిగ్రాంలు ఇవ్వలి!

సుబ్రహ్మణ్యం టెలిగ్రాములు మాత్రం సరిగా అందుకున్నాయటండీ! ఏంటో ఏదీ కూడా మామూలురీతిగా నడవటం లేదు! అంతా సబ్బుగా వున్నది

హరి శేషావతారం! ఏంటీ గొడవ? వచ్చిం దెవరు?

శేషా ఏమండోయ్, వినండి, వినండి! హరిగారు వచ్చిం దెవరని అడుగుతున్నారు! గుంటూరునుంచి వచ్చినవారేరీ?

సీతా [ముందుకొచ్చి] ఏమిటండీ? [నిర్ఘాంతపోతాడు]

హరి [కొన్ని క్షణాలు తేరిపారజూచి] 'ఎవరు శేషావతారం ఈ మనిషి?' అని నెమ్మదిగా అడుగుతాడు]

సీతా అయ్యా క్షమించండి! ఇది ఏ వీధండీ? బెజవాడవారి వీధిలోని వీరమాచనేని హరిపురుషోత్తంగారు కావాలి, నాకు!

శేషా అయ్యా అంతా వినండి! వీరికి వీరమాచనేని హరిపురుషోత్తంగారు కావాలట! అయితే ఈయన పేరేంటో, ఈవీధి పేరేంటో చెప్పండి!

వాసు! బాబూ దయచేయండి - ఇది వెన్నపూసవారి సందు ఈయనపేరు కుదరవల్లి హరిపురుషోత్తంగారు! ఆ ప్రక్క వీధిలో ఇదేమాదిరి వాకబు చేయండి!

సీతా అయ్యో నా ఖర్మం నేనింత సేపూ ఇదే ననుకుంటున్నాను! ఒరేయ్! శీనూ నడువు!

## 6

[సీతారామయ్య, శీనూ అడుగులో అడుగేసుకుంటూ అడవికి వెళ్లే రాములవారిలాగా వెళ్తున్నారు ప్రక్క వీధిలో ఎక్కడో తెలుసుకోవాలని అనుకుని కూడా తెలుసుకోకుండా వెళ్తున్నారు]

శేషావతారం సోదర, సోదరీమణులారా! ఇక మీరు మీమీ ఇళ్లకు వెళ్లి హాయిగా నిద్రించండి

[ఒక్కొక్కరే వెళ్లిపోతున్నారు ఆడవాళ్ల గుసగుసలు ఎక్కువగా వున్నాయి హరి దళ్ళలుతలు వేసుకున్నారు అంతా వెళ్లిపోయారు]

రంగయ్యగారి భార్య ఈ బంధువులనే వాళ్లకు బుద్ధి లేదు! అర్ధరాత్రి వచ్చి చుట్టుపక్కలవాళ్లనుకూడా నిద్రపోనీయరు! ఒక్కొక్క ఇంట్లో నాలుగేసి కాపురాలుంటున్నాయి! ప్రతిరోజూ ఏదో ఒక ఇంటికి ఏదో ఒక పోర్షనులోవాళ్లకు బంధువులు రావలసిందే తను నిలోచ్చటానికి చోటు లేదు తిండీ - అంటే లేనేలేదు తిండి! ఏమి జీవితాలు - వెధవ జీవితాలు

రంగయ్య ఇక చాల్లే కాస్త నిద్రపోనీయ్!

[అంతా చల్లబడింది ప్రక్కవీధిలో వుండి వుండి ఒక కుక్కమాత్రం మొరుగుతోంది రంగయ్యగారింటి గడియారం 2 గంటలు కొట్టింది] ★

★ పరిశీలన ★

"అమృత ఫార్మశీ" మందులు

వేలాదిరోగులు వాడుటకుగల ముఖ్యకారణాలు

* స్వంత లేబరేటరీలో శాస్త్రీయముగా మందులుతయారై సత్వర గుణమిచ్చుట
* మందులన్నియు కేవలము వనమూలికల సారాంశమే అగుటవలన తినుటకు హితవుగా రుచికరముగానుండుట
* పేదసాదలకు అందుబాటులో నుండునాగున స్వల్పధరలకే మందులందజేయుట.

అమృత ఫార్మశీ,

హెడ్డాఫీసు: చర్మరోగ చికిత్సాలయము బ్రాంచి:

మారుటేరు ★ రాజమండ్రి

పశ్చిమ గోదావరి జిల్లా గోదావరిస్టేషనుకు ఎదురుగా